క్లుప్తంగా

మహారాష్ట్ర కోర్టులో ఎమ్మెల్యేలు



బిలోలి కోర్టుకు హాజరైన ఎమ్మెల్యేలు

జగిత్యాలజోన్: మహారాష్ట్రలోని బిలోలి సెషన్స్ కోర్టుకు బుధవారం తెలంగాణ రాష్ట్ర ఎమ్మెల్యేలు చింతకుంట విజయరమణ రావు, గంగుల కమలాకర్, రాజేంద్రనగర్ ప్రకాష్ గౌడ్, మాజీ ఎమ్మెల్యేలు హన్మంతు షిండే, రత్నం హాజరయ్యారు. గతంలో టీడీపీ ఎమ్మెల్యేలుగా ఉన్న వీరంతా, బాబ్లీ ప్రాజెక్టు నీటి విడుదల విషయంలో చేసిన పోరాటంలో అక్కడి పోలీసులు కేసు నమోదు చేశారు. ఆ కేసు విచారణ బిలోలి సెషన్స్ కోర్టులో నడుస్తున్నందునా, బుధవారం ఆ కేసు విచారణకు వీరంతా హాజరయ్యారు.

నిజాయితీ చాటుకున్న ఆర్టీసీ కండక్టర్



పుస్తెల తాడు అందజేస్తున్న డీఎం సునీత

జగిత్యాలటౌన్: బస్సులో ప్రయాణికురాలు పోగొట్టుకున్న నగలు అందజేసి తన నిజాయితీని చాటుకుని ఆదర్శంగా నిలిచారు కండక్టర్ షబానా బేగం. బుధవారం రాయికల్ ఇటిక్యాల బస్సులో ప్రయాణిస్తున్న బిట్ల లక్ష్మి తన బంగారు పుస్తెలతాడును బస్సులో పోగొట్టుకోగా అదే బస్సులో కండక్టర్ విధులు నిర్వహిస్తున్న షబానా బేగం బంగారు పుస్తెలతాడు గుర్తించి ఆర్టీసీ డీఎం సునీతకు అప్పగించారు. పుస్తెల తాడు బిట్ల లక్ష్మిదని గుర్తించిన డీఎం ఆమెకు అప్పగించి కండక్టర్‌ను అభినందించారు.

తడి, పొడి చెత్త ద్వారా వర్మి కంపోస్టు తయారీ



వర్మి కంపోస్టును తూకం వేస్తున్న జీపీ సిబ్బంది

జగిత్యాలజోన్: జగిత్యాల అర్బన్ మండలంలోని హస్నాబాద్ గ్రామ పంచాయతీ సిబ్బంది ప్రతి రోజు ఇళ్ల నుంచి సేకరించిన తడి, పొడి చెత్తతో వర్మి కంపోస్టు తయారు చేసి శభాష్ అనిపించుకుంటున్నారు. ఈ మేరకు 125 కిలోల వర్మి కంపోస్టు తయారు చేసి, జిల్లా పంచాయతీ అధికారుల అదేశాల మేరకు తయారు చేసిన వర్మి కంపోస్టును గ్రామంలో హరిత హారంలో నాటిన మొక్కలతో పాటు నర్సరీకు వేస్తున్నారు. దీంతో, గ్రామ ప్రత్యేకాధికారి విజయలక్ష్మి, ఎంపీవో సలీం, పంచాయతీ కార్యదర్శి బాలె ప్రమోద్‌ను గ్రామస్తులు, అధికారులు అభినందించారు.

మహాలక్ష్మి ఆలయంలో బీజేపీ నాయకుల పూజలు



అమ్మవారికి పూజలు చేస్తున్న భోగ శ్రావణి

సారంగాపూర్: మండలంలోని పోతారం మహాలక్ష్మి అమ్మవారిని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు భోగ శ్రావణి దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. బుధవారం అమ్మవారి వార్షిక జాతర ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఆలయంలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. ఆమె వెంట బీజేపీ మండల అధ్యక్షుడు ఎండబెట్ల వరుణ్‌కుమార్ తదితరులు ఉన్నారు.

కుక్కల దాడిలో గొర్రెలు మృతి

వెల్గటూర్ : కుక్కల దాడిలో గొర్రెలు మృతిచెందిన సంఘటన వెల్గటూర్ మండలం జగదేవుపేటలో బుధవారం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన నాగుల గంగయ్య గొర్రెలు పెంచుతూ జీవిస్తున్నాడు. మంగళవారం సాయంత్రం మేతమేసి వచ్చిన తన గొర్రెలను గ్రామానికి సమీపంలోని తన గొర్రెల షెడ్‌లోకి పంపించి ఇంటికి వెళ్లాడు. అర్ధరాత్రి షెడ్‌లోకి ప్రవేశించిన కుక్కలు గొర్రెలపై దాడిచేయడంతో ఏడు గొర్రెలు మృత్యువాత పడ్డాయి. ఈ సంఘటనలో సుమారు యాభై వేల వరకు నష్టపోయానని, ప్రభుత్వం ఆదుకోవాలని రైతు గంగయ్య వేడుకుంటున్నారు.

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం



రాయికల్‌లో ప్రతిజ్ఞ చేస్తున్న చిన్నారులు

జగిత్యాలజోన్: జగిత్యాల రూరల్ మండలంలోని లక్ష్మీపూర్ అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం పోషణ పక్వాడ నిర్వహించారు. కార్యక్రమానికి ఐసీడీఎస్ సూపర్ వైజర్ జానకి, గర్భిణులు, పిల్లలు హాజరైనారు. గర్భిణులు పౌష్టికహారం తీసుకుంటే పుట్టబోయే బిడ్డలు ఆరోగ్యంగా పుడుతారని, అలాగే చిన్నారులకు బలవర్థకమైన ఆహారం అందించాలని సూచించారు.

మల్లాపూర్: గర్భిణులు, బాలింతలు, కిశోర బాలికలు పౌష్టికాహారం తీసుకోవడంతో సంపూర్ణ ఆరోగ్యవంతులవుతారని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శంకరమ్మ అన్నారు. మండలంలో ముత్యంపేటలో బుధవారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో 'పోషణ పక్వాడ'పై అవగాహన కల్పించారు. అంగన్‌వాడీ టీచర్లు, ఏఎన్‌ఎం, ఆశకార్యకర్తలు పాల్గొన్నారు.

సారంగాపూర్: బలవర్థకమైన ఆహారం తీసుకుంటేనే విద్యార్థుల్లో శారీరక, మానసిక ఎదుగుదల ఉంటుందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ లత అన్నారు. మండలంలోని కోనాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం పోషకాహారం అంశంపై విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించి బహుమతులు అందించారు. హెచ్‌ఎం జానకి, అంగన్‌వాడీ టీచర్లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రాయికల్: మండలంలోని రామాజీపేటలో పోషకాహారం పై విద్యార్థులకు పరిశుభ్రమైన ఆహార అలవాట్లు, పోషక విలువలు కలిగిన ఆహార పదార్థాలు, రక్త హీనత గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు, గర్భిణులు పాల్గొన్నారు.

కోరుట్ల రూరల్: మండలంలోని గుమ్లాపూర్ అంగన్‌వాడీ కేంద్రంలో పోషణా పక్షోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా పోషకాహారాలపై పిల్లల తల్లులకు అవగాహన కల్పించి ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ షమీమా సుల్తానా, అంగన్‌వాడీ టీచర్ పాల్గొన్నారు.

పెగడపల్లి: అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందిస్తున్న సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మహేశ్వరి కోరారు. మండలంలోని అన్ని అంగన్‌వాడీ కేంద్రాల్లో బుధవారం పోషణ పక్షోత్సవ మాసంలో భాగంగా మండలంలోని పెగడపల్లి, ఆరవెల్లి గ్రామాల్లోని అంగన్‌వాడీ టీచర్లు పలు కార్యక్రమాలు నిర్వహించారు. అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లు పాల్గొన్నారు.

డీఏ, పీఆర్సీ బకాయిలు చెల్లించాలి

రాయికల్: స్కూల్ కాంప్లెక్స్ ఉపాధ్యాయుల డీఏ బకాయలు చెల్లించాలని పీఆర్టీయూ టీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పొన్నం రమేశ్ ప్రభుత్వాన్ని కోరారు. రాయికల్‌లో బుధవారం జరిగిన సంఘ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ ఏడాది పాటు గతేడాది డీఏ బకాయిలు రాక ఉపాధ్యాయులు ఇబ్బంది పడుతున్నారని పేర్కొన్నారు. జిల్లాలో స్కూల్ కాంప్లెక్స్ పరిధిలో పని చేస్తున్న ఉపాధ్యాయులకు పీఆర్సీ బకాయిలు మూడు మాత్రమే వచ్చాయని, ఇంకా 15 బకాయిలు చెల్లించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి అంతడుపు గంగారాజం, మండల అధ్యక్షుడు రాపర్తి నర్సయ్య, ప్రధాన కార్యదర్శి తాటిపాముల రమేశ్ పాల్గొన్నారు.

అదనపు కలెక్టర్‌కు సన్మానం

జగిత్యాల: జిల్లాను అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడానికి ఉద్యోగులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా అదనపు కలెక్టర్ రాంబాబు అన్నారు. ఇటీవల బాధ్యతలు స్వీకరించిన అదనపు కలెక్టర్ రాంబాబును బుధవారం టీఎన్జీవో నాయకులు సత్కరించారు. జిల్లాలోని అధికారులు, ఉద్యోగులు కలిసికట్టుగా పనిచేసి ప్రభుత్వ పథకాలు ప్రజలకు చేరేలా చర్యలు తీసుకోవాలన్నారు. టీఎన్‌జీవో అధ్యక్షుడు బోగ శశిధర్, నాగేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ కవిత జన్మదిన వేడుకలు



భోజనం వడ్డిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత

జగిత్యాలజోన్: జిల్లా కేంద్రంలోని వాల్మీకి ఆవాసంలో ఎమ్మెల్సీ కవిత జన్మదినం సందర్భంగా బుధవారం జెడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత అన్నదానం చేశారు. స్వయంగా పిల్లలందరికి వడ్డించి, వారితో కలిసి సహపంక్తి భోజనం చేశారు.కార్యక్రమంలో అర్బన్ ఎంపీపీ లక్ష్మి, సింగిల్ విండో చైర్మన్లు మహిపాల్‌రెడ్డి, సందీప్‌రావు, ఎంపీటీసీ సురేందర్ రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

రాయికల్: నిజామాబాద్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత జన్మదిన వేడుకలు రాయికల్ పట్టణంలో మున్సిపల్ చైర్మన్ మోర హన్మాండ్లు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి ప్రభుత్వ ఆస్పత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు.

మల్లాపూర్: మండల కేంద్రంతో పాటు రేగుంటలో బీఆర్ఎస్, భారత జాగృతి యువత ఆధ్వర్యంలో కవిత 46వ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. మల్లాపూర్‌లోని భరతమాత కూడలి వద్ద కేక్ కట్ చేయగా, రేగుంటలో 18మంది పేద మహిళలకు చీరలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

సారంగాపూర్: ఎమ్మెల్సీ కవిత జన్మదిన వేడుకలను బీర్‌పూర్ మండలంలో బుధవారం బీఆర్ఎస్ శ్రేణులు ఘనంగా నిర్వహించాయి. ఈ సందర్భంగా ప్రముఖ పుణ్యక్షేత్రం బీర్‌పూర్ శ్రీలక్ష్మీనృసింహస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, కేక్‌ను కట్ చేశారు.

'గృహజ్యోతి' సద్వినియోగం చేసుకోవాలి



జీరో బిల్లు అందిస్తున్న నాయకులు,అధికారులు

కోరుట్ల రూరల్: మండలంలోని సంగెంలో గృహజ్యోతి పథకంలో భాగంగా జీరో కరెంట్ బిల్లులను విద్యుత్ అధికారులతో కలిసి కాంగ్రెస్ నాయకులు బుధవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు టపాకాయలు పేల్చి మిఠాయిలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏఈ బుక్యా శ్రీనివాస్ నాయక్, లైన్‌మెన్ తస్లీమ్, సతీశ్, సురేశ్, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

ఇబ్రహీంపట్నం: అర్హులైన వారందరూ గృహజ్యోతి పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని కాంగ్రెస్ పార్టీ సేవాదళ్ మండల అధ్యక్షుడు నాంపెల్లి వెంకటాద్రి అన్నారు. మండలంలోని వేములకుర్తిలో బుధవారం జీరో బిల్లును అందచేశారు. ఎవరికైన సాంకేతిక లోపంతో జీరో బిల్లు రాకపోతే తమ దృష్టికి తీసుకవస్తే సంబంధిత అధికారులతో జీరో బిల్లును వర్తించేలా చూస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో విద్యుత్ లైన్‌మెన్ కొలిపాక రాజు, రీడింగ్ సిబ్బంది కిశోర్, నాయకులు గుమ్మల రమేశ్, బుర్రిముత్యం, గుమ్మల నరేశ్, పాల్గొన్నారు.

రసం పీల్చే పురుగుల నివారణకు జాగ్రత్తలు తీసుకోవాలి



రైతులకు సూచనలిస్తున్న ఏడీఏ రమేశ్

మల్లాపూర్: పంటను ఆశించే రసం పీల్చే పురుగుల నివారణకు రైతులందరూ జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా సహాయ వ్యవసాయశాఖ అధికారి(ఏడీఏ) దండ రమేశ్ అన్నారు. మండలంలోని ముత్యంపేటలో బుధవారం వ్యవసాయ అధికారులు, రైతులతో కలిసి నువ్వు పంటను పరిశీలించి మాట్లాడారు. నువ్వు పంటను రసం పీల్చే పురుగులు, పచ్చదోమ, ఆకుతినే పురుగులు ఆశిస్తాయన్నారు. దీని నివారణకు ఇమిడాక్లోప్రిడ్ 300 గ్రాములు లేదా డైమిథోయేట్ 60 ఎంఎల్ లేదా ఎసిఫేట్ 300 గ్రాములు 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఏఈవోలు సంధ్య, గజానంద్, రైతులు పాల్గొన్నారు.

ఇబ్రహీంపట్నం: ప్రస్తుత పరిస్థితుల్లో సజ్జ పంట 15 నుంచి 20 రోజుల వ్యవధిలో పంటకు మొగి పురుగు, కత్తెర పురుగు ఉధృతి ఎక్కువగా ఉందని దీని నివారణకు రైతులు చర్యలు చేపట్టాలని మండల వ్యవసాయ అధికారి దీపిక తెలిపారు. మండలంలో పలుగ్రామాల్లో సాగు చేస్తున్న సజ్జ పంటలను బుధవారం ఏవో పరిశీలించారు. మొగి పురుగు , కత్తెర పురుగుల నివారణకు ఎలాంటి రసాయన మందులు వాడాలో రైతులకు వివరించారు. అనంతరం ఇబ్రహీంపట్నం సొసైటీలో ఎరువుల నిల్వలను తనిఖీ చేశారు. కార్యక్రమంలో ఏఈవో రవళిక, నరేష్, రైతులు పాల్గొన్నారు.

కార్పొరేషన్ల ఏర్పాటుపై సంబరాలు





జగిత్యాల, కోరుట్లలో సీఎం మంత్రి,ఎమ్మెల్సీ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

జగిత్యాలటౌన్: రాష్ట్రంలో పలు కార్పొరేషన్లు ఏర్పాటు చేస్తూ రాష్ట్ర మంత్రి మండలి నిర్ణయం తీసుకోవడంపై పలు కుల సంఘాలు హర్షం వ్యక్తం చేశాయి. జిల్లా కేంద్రంలోని తహసీల్ చౌరస్తాలో సీఎం,మంత్రుల చిత్రపటాలకు వీరశైవులు, మున్నూరు కాపులు సీఎం మంత్రుల చిత్రపటాలకు క్షీరాభిషేకం చేయగా, పట్టణంలోని మంచి నీళ్ల బావి చౌరస్తాలో ముదిరాజ్‌లు క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో వీర శైవ నాయకులు గాజుల రాజేందర్,మున్నూరు కాపు నాయకులు హరి అశోక్‌కుమార్ పాల్గొన్నారు.

కోరుట్ల: రాష్ట్ర ప్రభుత్వం 16 కులాలకు ప్రత్యేక కార్పొరేషన్లు ఏర్పాటు చేయటంతో పట్టణంలో కాంగ్రెస్ నాయకులు, వైశ్యులు బుధవారం సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి, కాంగ్రెస్ కోరుట్ల ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావు చిత్ర పటాలకు క్షీరాభిషేకం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం 16 కులాలకు కార్పొరేషన్లు ఏర్పాటు చేయటం చారిత్రక నిర్ణయమని పేర్కొన్నారు. కార్యక్రమంలో పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు తిరుమల గంగాధర్ గౌడ్, బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు గడ్డం వెంకటేశ్ గౌడ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు సత్యనారాయణ గౌడ్, నాయకులు పాల్గొన్నారు.

మెట్‌పల్లి: ప్రభుత్వం ఆర్యవైశ్య కార్పొరేషన్‌ను ఏర్పాటు చేయాలని నిర్ణయించడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ పట్టణంలో బుధవారం ఆర్యవైశ్యులు సంబరాలు చేసుకున్నారు. ఈ మేరకు వాసవీ ఆలయ ఆవరణలో సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేసి కృతజ్ఞతలు తెలిపారు. సంఘం అధ్యక్షుడు రాంబాబు, లింబాద్రి, సురేష్, శ్రీనివాస్, లక్ష్మీనారాయణ, నవీన్ పాల్గొన్నారు.

ధర్మపురి : మున్నూరుకాపు కార్పొరేషన్ ఏర్పాటుకు రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించడంతో బుధవారం సంబరాలు జరిపారు. స్థానిక నంది విగ్రహం వద్ద సీఎం రేవంత్‌రెడ్డి, ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేసి వారికి కృతజ్ఞతలు తెలిపారు.

రాయికల్: ఆర్యవైశ్య సంఘ నాయకులు రాయికల్ పాత బస్టాండ్ లో సీఎం రేవంత్‌రెడ్డి,ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు గంప ఆనందం,పట్టణ అధ్యక్షుడు చింత శివకుమార్, వైశ్య నాయకులు పాల్గొన్నారు.

గొల్లపల్లి : ఆర్యవైశ్య కార్పొరేషన్ ఏర్పాటుకు మంత్రివర్గం ఆమోదం తెలిపిన సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి గొల్లపల్లి మండల సంఘ భవనంలో క్షీరాభిషేకం చేసి స్వీట్లు పంపిణీ చేశారు.

కథలాపూర్: మండలంలోని చింతకుంటలో సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి కాంగ్రెస్ నాయకులు బుధవారం క్షీరాభిషేకం చేశారు. వివిధ కులసంఘాల కార్పొరేషన్లను ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించడంపై సంతోషం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు చెదలు సత్యనారాయణ, లోక నర్సారెడ్డి, బైర దేవ్‌యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

రెడ్డి కార్పొరేషన్ ఏర్పాటు హర్షనీయం

మల్లాపూర్: ప్రభుత్వం రెడ్డి కార్పొరేషన్ ఏర్పాటు చేయడం హర్షనీయమని రెడ్డి కార్పొరేషన్ పోరాట సమితి నాయకుడు బద్దం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మండలంలోని కొత్తదాంరాజుపల్లిలో బుధవారం మాట్లాడారు. రెడ్డి హక్కుల కోసం, కార్పొరేషన్ కోసం గత తొమ్మిదేళ్లుగా చేస్తున్న పోరాటాన్ని గుర్తించి రెడ్డి కార్పోరేషన్ ఏర్పాటు చేసిన సీఎం రేవంత్‌రెడ్డికి, రాష్ట్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.

మున్నూరు కాపు నాయకుల హర్షం

మేడిపల్లి: మున్నూరు కాపు కార్పొరేషన్ ఏర్పాటు చేసినందుకు భీమారం మండలం కేంద్రంతో పాటు, కమ్మరిపేటలో బుధవారం మున్నూరు కాపు సంఘం నాయకులు సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ విప్, ఆది శ్రీనివాస్ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు.

ప్రభుత్వ వైఫల్యాలను ప్రజాక్షేత్రంలో ఎండగడుతాం



ప్రొసీడింగ్ అందిస్తున్న బీజేపీ నాయకులు

మల్లాపూర్: ప్రభుత్వ వైఫల్యాలలను ప్రజాక్షేత్రంలోనే ఎండగడుతామని బీజేపీ మండల అధ్యక్షుడు గోపిడి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలో రేణుకా ఎల్లమ్మ ఆలయ అభివృద్ధికి ఎంపీ ల్యాండ్ నిధులు రూ.4లక్షల ప్రొసీడింగ్ పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో బీజేపీ మండల ఉపాధ్యక్షుడు లవంగ శివకుమార్, నాయకులు ఇల్లెందుల మనోజ్‌కుమార్, గౌడ సంఘం మండల అధ్యక్షుడు ముద్దం శరత్‌గౌడ్, పట్టణ అధ్యక్షుడు బండారి శేఖర్, సభ్యులు బండి లింగస్వామి, సత్యం, కుంట కిషన్, నాగుల వినోద్, జైపాల్, రాకేశ్ పాల్గొన్నారు.

విద్యార్థులకు స్కూల్ బ్యాగులు పంపిణీ

మండల కేంద్రంతో పాటు చిట్టాపూర్, గుండంపల్లి, ముత్యంపేట, రాఘవపేట, వాల్గొండ గ్రామాల్లోని ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు బీజేపీ మండల శాఖ ఆధ్వర్యంలో డెస్కులతో కూడిన స్కూల్ బ్యాగులను గోపిడి శ్రీనివాస్‌రెడ్డి పంపిణీ చేశారు. ఎంపీ ధర్మపురి అర్వింద్ చొరవతో ఓఎన్‌జీసీ ద్వారా డెస్కు స్కూల్ బ్యాగులు అందించామని పేర్కొన్నారు.

అఖిల భారత యాదవ జిల్లా యూత్ అధ్యక్షుడిగా రాజశేఖర్



ఇబ్రహీంపట్నం: అఖిల భారత యాదవ మహాసభ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడిగా ఇబ్రహీంపట్నంకు చెందిన రెబ్బటి రాజశేఖర్‌యాదవ్‌ను నియమిస్తూ రాష్ట్ర అధ్యక్షుడు ఐలాబోయిన రమేశ్ యాదవ్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. హైదరాబాద్‌లో జరిగిన సమావేశంలో నియామక పత్రాన్ని రాజశేఖర్‌యాదవ్‌కు అందచేశారు. ఈ సందర్భంగా రాజశేఖర్‌యాదవ్ మాట్లాడుతూ తనకు మద్దతు తెలిపిన రాష్ట్ర కార్యవర్గ సభ్యులకు, జిల్లా అధ్యక్షుడు మల్లేశ్‌యాదవ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. సంఘం బలోపేతానికి కృషి చేస్తానని తెలిపారు.

చేనేత ఐక్యవేదిక రాష్ట్ర కార్యదర్శిగా శారద



శారద

ధర్మపురి: తెలంగాణ చేనేత ఐక్య వేదిక రాష్ట్ర మహిళా విభాగం కార్యదర్శిగా శారదను ఎంపిక చేసినట్లు రాష్ట్ర ఐక్య వేదిక అధ్యక్షులు రాపోలు వీర మోహన్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ధర్మపురికి చెందిన భీమనాథి శారద నరేందర్ గత కొనేళ్లుగా సంఘం కార్యకలాపాల్లో చురుగ్గా పాల్గొని సంఘం అభివృద్ధితో పాటు మహిళ సాధికారికతకు ఎంతో కృషి చేసింది. శారద చేసిన సేవలను గుర్తించిన రాష్ట్ర నాయకత్వం రాష్ట్ర కమిటీలో స్థానం కల్పించారు. దీనికి కృషి చేసిన రాష్ట్ర అధ్యక్షులకు కృతజ్ఞతలు తెలిపారు. ఆమె నియామకం పట్ల స్నేహితులు, అభిమానులు, పట్టణ ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

మండలంలో మూడు పరీక్షా కేంద్రాలు

కథలాపూర్: ఈనెల 18 నుంచి జరిగే పదోతరగతి పబ్లిక్ పరీక్షలకు మండలంలో మూడు పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు ఎంఈవో ఆనందరావు బుధవారం తెలిపారు. మండలంలో 13 ఉన్నత పాఠశాలలుండగా.. ఇందులో 458 మంది పదోతరగతి విద్యార్థులు చదువుతున్నారు. కథలాపూర్ మోడల్ స్కూల్ పరీక్ష కేంద్రంలో మోడల్‌స్కూల్, కేజీబీవీ, కథలాపూర్, సిరికొండ, భూషణరావుపేట, చింతకుంట జెడ్పీ హైస్కూల్, మాస్టో హైస్కూల్ విద్యార్థులకు కేటాయించారు. గంభీర్‌పూర్ జెడ్పీ హైస్కూల్ పరీక్ష కేంద్రంలో గంభీర్‌పూర్, తాండ్ర్యాల జెడ్పీ హైస్కూల్ విద్యార్థులకు కేటాయించారు. అంబారిపేట జెడ్పీ హైస్కూల్‌లో అంబారిపేట, పోతారం జెడ్పీ హైస్కూల్‌లో చదివే విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. కాగా.. తక్కళ్లపెల్లి, బొమ్మెన జెడ్పీ హైస్కూల్ విద్యార్థులకు భీమారం మండలం మన్నెగూడెం జెడ్పీ హైస్కూల్‌లో పరీక్ష కేంద్రం కేటాయించారు.

అలరించిన విద్యార్థుల వీడ్కోలు వేడుక



నృత్యాలు చేస్తున్న విద్యార్థినులు

కథలాపూర్: మండలంలోని బొమ్మెన జెడ్పీ హైస్కూల్‌లో పదోతరగతి విద్యార్థులకు బుధవారం వీడ్కోలు పార్టీ నిర్వహించారు. తొమ్మిదో తరగతి విద్యార్థుల ఆధ్వర్యంలో ప్రత్యేకంగా వేడుకలు ఏర్పాటు చేశారు. పరీక్షల సమయంలో విద్యార్థులు పాటించవలిసిన జాగ్రత్తలను ఉపాధ్యాయులు వివరించారు. అనంతరం విద్యార్థులు ఆట పాటలతో సందడి చేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం మధుకుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఘనంగా కవయిత్రి మొల్ల జయంతి



వేములకుర్తిలో నివాళి అర్పిస్తున్న నాయకులు

ఇబ్రహీంపట్నం: తెలుగు తొలి మహిళ కవయిత్రి మొల్లమాంబ జయంతిని ఇబ్రహీంపట్నం,వేములకుర్తి గ్రామాల్లో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కుమ్మరి సంఘ భవనంలో మొల్లమాంబ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో కుమ్మరి సంఘ సభ్యులు రాధరాపు దేవదాస్, నాంపెల్లి రమేష్, రాదరాపు ప్రభాకర్, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వీరబ్రహ్మేంద్రస్వామి కల్యాణం



ధర్మపురి: పట్టణంలోని పోతులూరి వీరబ్రహేంద్రస్వామి ఆలయంలో స్వామివారి కల్యాణం బుధవారం వేద మంత్రోచ్ఛారణల మధ్య ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ హాజరై పూజలు చేశారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో విశ్వబ్రాహ్మణులు హాజరయ్యారు.

ఘనంగా పోలేరమ్మ ఆలయ వార్షికోత్సవం

మెట్‌పల్లి: పట్టణంలోని పోలేరమ్మ ఆలయ వార్షికోత్సవ వేడుకలను బుధవారం స్వర్ణకార సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘ సభ్యులు ప్రత్యేక పూజలు చేసి భక్తులకు అన్నప్రసాదం ఏర్పాటు చేశారు.

సంక్షిప్త వార్తలు

ఎస్సైకి కాంగ్రెస్ నాయకుల ఫిర్యాదు

కథలాపూర్: కాంగ్రెస్ ప్రభుత్వంపై అసభ్యకరంగా సోషల్ మీడియాలో పోస్టులు చేస్తున్న వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని ఎస్సై నవీన్‌కుమార్‌కు కాంగ్రెస్ నాయకులు బుధవారం ఫిర్యాదు చేశారు. బీఆర్ఎస్ నాయకులు సోషల్ మీడియాలో ఇష్టమొచ్చినట్లు పోస్టులు పెడుతున్నారని నాయకులు పేర్కొన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు కాయితి నాగరాజు, నాయకులు పాల్గొన్నారు.

నిబంధనలు పాటించాలి

మెట్‌పల్లి: వాటర్ ప్లాంట్ల నిర్వాహకులు నిబంధనలు పాటించాలని ఇన్‌చార్జి శానిటరీ ఇన్‌స్పెక్టర్ రత్నాకర్ సూచించారు. పట్టణంలోని పలు వాటర్ ప్లాంట్లను బుధవారం సిబ్బందితో కలిసి తనిఖీ చేశారు. ప్లాంట్ల నిర్వాహకులు తప్పనిసరిగా ఐఎస్ఐ నిబంధనలు పాటించాలని, లేనిపక్షంలో సీజ్ చేస్తామని ఈ సందర్భంగా పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎన్విరాన్‌మెంట్ ఇంజినీర్ విష్ణు, ముజీబ్, నాయక్, నిజాం తదితరులున్నారు.

విద్యార్థులకు స్కూల్ బ్యాగ్స్ పంపిణీ

కోరుట్ల రూరల్: మండలంలోని యూసుఫ్‌నగర్ గ్రామంలోని ప్రైమరీ స్కూల్ విద్యార్థులకు ఓఎన్‌జీసీ ఆధ్వర్యంలో ఎంపీ అర్వింద్ సహకారంతో మంజూరైన స్కూల్ బ్యాగ్స్, టెబుల్ మెట్‌ను బీజేపీ నాయకులు బుదవారం విద్యార్థులకు పంపిణీ చేశారు.కార్యక్రమంలో బీజేపీ నాయకుడు గుగ్గిళ్ల తుక్కారాం గౌడ్, మండల అధ్యక్షుడు విజయ్ కుమార్, హెచ్‌ఎం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కథలాపూర్: మండల కేంద్రంలోని జెడ్పీ హైస్కూల్‌లో పదోతరగతి విద్యార్థులకు బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు యాగండ్ల రమేశ్‌గౌడ్ పరీక్ష సామగ్రి బుధవారం పంపిణీ చేశారు. అనంతరం ఉపాధ్యాయులు రమేశ్‌గౌడ్‌నుసన్మానించారు.

రాయికల్: మండలంలోని అల్లీపూర్.భూపతిపూర్,తాట్లావాయి,మైతాపూర్.రామాజీపేట.సింగరావుపేట గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు బుధవారం బీజేపీ నాయకులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు అన్నవేణి వేణు, ఎంపీటీసీ మధుకర్, మహేష్, నాయకులు పాల్గొన్నారు.

ఎంపీటీసీ నిధులతో బోర్‌వెల్

వెల్గటూర్ : మండలంలోని స్తంభంపల్లిలోని బోయవాడలో ఎంపీటీసీ సతీష్ ఆధ్వర్యంలో బోర్‌వెల్ ఏర్పాటు చేశారు. గ్రామంలోని బోయవాడ కాలనీవాసులు తాగునీటికి ఇబ్బందులు పడుతుండడంతో ఎంపీటీసీ నిధులు బోర్‌వెల్, మోటర్ చేశారు. కార్యక్రమంలో మాజీ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ పొడేటి రవి, నాగుల రమేశ్ పాల్గొన్నారు.

గ్రామాభివృద్ధికి కలిసికట్టుగా కృషి

మల్లాపూర్: గ్రామాభివృద్ధికి కలిసికట్టుగా కృషి చేస్తామని ఎంపీటీసీ ఫోరం అధ్యక్షుడు ఏనుగు రాంరెడ్డి అన్నారు. మండలంలోని సిరిపూర్‌లో స్థానిక జెడ్పీ హైస్కూల్‌లో బుధవారం బోర్‌వెల్ నిర్మాణానికి ఆయన భూమి పూజ చేసి పనులు ప్రారంభించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ భూక్య గోవింద్ నాయక్, స్థానిక నాయకులు, గ్రామస్తులు కుల సంఘాల నాయకులు పాల్గొన్నారు.

తైబజార్ వేలం

మెట్‌పల్లి: మున్సిపాలిటీలోని తైబజార్‌కు బుధవారం వేలం నిర్వహించినట్లు మున్సిపల్ కమిషనర్ మోహన్ తెలిపారు. 2024–25 సంవత్సరానికి సంబంధించిన వేలం నిర్వహించగా మొత్తం ఐదుగురు పాల్గొన్నారని, అల్గొట్ నరేందర్ అనే వ్యక్తి రూ.9.90లక్షలకు దక్కించుకున్నట్లు తెలిపారు.

18న పెగడపల్లి రాజన్న ఆలయ కమిటీ నూతన కార్యవర్గం

పెగడపల్లి: మండల కేంద్రంలోని రాజన్న ఆలయం నూతన కమిటీ ఎన్నికలు ఈ నెల 18 నిర్వహించనున్నట్లు ప్రస్తుత కమిటీ చైర్మన్ గంగారెడ్డి, సభ్యులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆలయ ప్రాంగణంలో ఉదయం 10 గంటలకు నిర్వహించే నూతన కార్యవర్గం ఎన్నికలకు సభ్యత్వం ఉన్న సభ్యులు సకాలంలో హాజరు కావాలని కోరారు.

అభివృద్ధి పనులకు భూమిపూజ

కథలాపూర్: మండలంలోని గంభీర్‌పూర్‌లో రూ.15 లక్షలతో చేపట్టే వివిధ అభివృద్ధి పనులకు ఎంపీపీ జవ్వాజి రేవతి బుధవారం భూమిపూజ చేశారు. సీసీ రోడ్డుకు రూ. 10 లక్షలు, ప్రభుత్వ పాఠశాలలో మరుగుదొడ్లకు రూ. 3 లక్షలు, రెండు బోరుబావులకు కార్యక్రమంలో ఏఈ చంద్రశేఖర్, నాయకులు పోతు శేఖర్, జవ్వాజి చౌదరి గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.